
# సినిమా (కి) కథ

పాలగుమ్మి పద్మరాజు




పట్టయ్యచౌదరి ఈనాడు పాండీబజార్‌లో పేవ్‌మెంటుమీద పగలల్లా తిరిగి కాలక్షేపం చేస్తున్నాడూ అంటే, కథ దొరక్క, తను తియ్యబోయే సినిమాకి కథ. అంటే పాండీబజార్‌లో కథలు దొరుకుతాయని అతని అభిప్రాయం కాదు. కథలకోసం వెతకడం అతని కలవాటైపోయింది. పాండీబజార్‌లో పగలంతా గడపడమూ అలవాటైపోయింది.

అతను రిక్షాలోవొచ్చి ఉడిపి హోటల్ ముందు దిగుతాడు. సుబ్బులు అతనికోసం కాశట్టుగా అక్కడ కాచుకుని ఉంటాడు. చౌదరి రిక్షా దిగడంతోటే సుబ్బులంటాడు:

"మనకి రిక్షా ఏటండి చౌదరిగారో! కొత్త కారు తీసెయ్యండి!" చౌదరంటాడు:

"కొత్తకారు కొంటే ప్రొడక్షన్‌లో తుక్కైపోతుందిరా. కథ రెడీ అవనీ, రొండు పాత స్టాండర్డులు కొనిపారేస్తా."

ఇద్దరూ కలిసి కథల్ని గురించీ, కార్లని గురించీ కబుర్లు చెప్పకుంటూ లోపలికి వెడతారు. సుబ్బులు చౌదరితో అతిముఖ్యమైన విషయం చర్చిస్తున్నట్టు ముఖంపెట్టి ఇది ఒక కాఫీ హోటలన్న సంగతే తనకు గుర్తులేనట్టు లోపలికి వెడతాడు. చౌదరి "రెండు పెసరట్లు- బాగా వేగాలి, అల్లం పచ్చిముక్కలతో సహా దండిగా పారెయి." అని ఆర్డరిస్తాడు. అలవాటైన సర్వర్‌కి రొండో పెసరట్టు తనకో సమని తెలియనట్టుగానే కథకుల్ని గురించి అతి తన్మయత్వంతో చెపుతుంటాడు సుబ్బులు.

"సదాశ్రీ అని కొత్తరైటరండి మనోడే---- అసలు పేరు సంచుల దామోదరం, ఆడిదగ్గరుండందో కత! రొండొందల రోజు లెల్లాల్సిందే అది పిక్చర్ తీత్తే మా పసందైన కతలెండి. మనం ఇచ్చినంతా పుచ్చుకుంటాడు. నోరెత్తడు."

ఈలోగా పెసరట్లొస్తాయి.

"ఏంటిది చౌదరిగారో! మా బాగుందండి. రోజూ ఇదేపనా" అంటాడు సుబ్బులు.

"ఏడిశావు తినరా." అంటాడు చౌదరి.

తింటూ సుబ్బులు సంచుల దామోదరం సదాశ్రీ ఎల్లా. అయాడో చెపుతుంటాడు.

"మన ఆఫీసుకి రమ్మను, విందాం." అంటాడు చౌదరి.

"ఆఫీసు" కుమారి మోచనీదేవి ఇల్లు. ఇక మోచనీదేవి ఎవరంటే--

విశాఖపట్టణం సముద్ర తీరానికి ఎన్నో రోడ్లు ఎత్తుమీంచి కిందికి దిగుతాయి. అందులో హాస్పటల్‌నించి కిందికి దిగేరోడ్డు కొసని- పది- పదిహేడు గుడిసెలున్నాయి. అందులో ఒక గుడిసెలో తలుపులనే పడుచు ఉండేది.

రామకృష్ణ చౌదరనే పాతికేళ్ళ యువకుడు బి.కాం. చదవడానికని నెల్లూరునుంచి అక్కడి కొచ్చాడు- గుడిసెకికాదు- విశాఖపట్నానికి, పాతికేళ్ళ ప్రాంతానికి- (ఆ రోజుల్లో) ఇంటర్ పాసయిన యువకుడికి.

రెండు బస్‌రూట్లకూ- వంద యకరాల ఆస్తికి ఏకైక వారసుడికి- ఇద్దరు బిడ్డల తండ్రికీ- హాస్టల్ నియమావళికి కట్టుబడి ఉండడం కష్టం. అంచేత అతడు- ఒక చిన్న ఇల్లు ఆస్పత్రికి ఎదురుగా ఉన్న పేటలో అద్దెకు తీసుకున్నాడు.

మానవుడు పుట్టుకతోనే ఏడుపూ, నవ్వూ నేర్చుకున్నాడు. ఆకలైనప్పుడో, శరీరక బాధ ఏదేనా కలిగినప్పుడో ఏడుస్తాడు. కడుపు నిండి, శాంతంగా ఉన్నప్పుడు నవ్వుతాడు. కానైతే, ఏడుపుకీ, నవ్వుకీ వ్యత్యాస మాట్టే లేదు. ఏడవలేక నవ్వుతాం, నవ్వలేక ఏడుస్తాం కూడాను. ఈ ఏడుపూ నవ్వుకూడా కొంచెమించు మించు సమాన భావముల యొక్క బాహ్య పరిణామమని చెప్పవచ్చును.

శ్రీ మొక్కపాటి నరసింహశాస్త్రి

ఆ ఇల్లు తుడవడానికీ, కారియర్‌తోమి రెండు పూట్లా హోటల్‌నించి భోజనం తేవడానికి తలుపులుని కుదిర్చాడు. తలుపులు. పెద్దతట్లో ఆస్పత్రి కొచ్చిన రోగుల బంధువులకు భోజనాలు తెచ్చిపెడుతుండేది. అయితే చౌదరి దగ్గర కుదిరిన తరవాత. ఆమె తక్కిన బేరాలు వదులుకోవలసి వచ్చింది. ఎందుకంటే, చౌదరికి పాలు తేవాలి. అతనికీ అతని స్నేహితులికీ కాఫీలు కాచివ్వాలి. అతనికి రెండుపూట్లా వేడినీళ్ళు కాచివ్వాలి. స్నానానికి, ఈ పనులన్నీ అయేసరికి మిగతా బేరాలకు వ్యవధి చిక్కేదికాదు: అదీగాక, ఆ మొత్తానికి రెట్టింపు చౌదరివల్ల ముట్టేది.

ఆ తలుపులే కుమారి యోచనాదేవి. ఆ రామకృష్ణ చౌదరే మన సినిమా ప్రొడ్యూసరు చౌదరి, తలుపులు, కుమారి యోచనాదేవి ఎల్లాగైందంటే--

చౌదరి-- తండ్రి చనిపోయిన పదకొండో రోజుని- బస్సురూట్లమ్మే పి. సామ్ముతో, తలుపులమ్మతో మద్రాసు సెంట్రల్‌లో దిగాడు-- ఎయిర్ కండిషన్డ్ పెట్టెలోంచి. పక్కనున్న మూడోతరగతి పెట్టెలోంచి సన్నాసి దిగాడు. సన్నాసంటే తలుపులమ్మకి పూర్వాశ్రమంలో మేనమామా, తాళిగట్టిన మొగుడున్నూ. అంటే విశాఖపట్నం రోజుల్లో. అంటే తలుపులమ్మ తలుపులమ్మగా ఉన్నప్పుడు. అంటే, చీర బొడ్డుకిందకీ, తొడప్పైకీ విరిచి వెనక్కి దోపి, రవికైనా ఎరక్క నెత్తిమీద చుట్టుకుదురు పెట్టుకుని, దానిమీద డజను భోజనాలకారియర్లు లెక్కలేకుండా మోసిన రోజుల్లో. తనస్తన జఘన సౌభాగ్యం, ఊరుసంపద. కాలేజీ కుర్రవాళ్ళని అల్లరిపెట్టేస్తున్నాయన్న సంగతి తలుపులమ్మకే తెలియదు. వాటికి పదిరూపాయల విలువుందని ఒకనాడు చౌదరి ఆమెకు రుజువుచేశాడు. జ్ఞానోదయం అయినతరవాత తలుపులెన్నో విషయాలు గ్రహించింది. అంత విలువైన విషయాన్ని కాస్త మరుగుపరిస్తే వాటి విలువ మరింత పెరుగుతుందని ఆమె అనుభవంవల్ల తెలుసుకుంది. చీరతొడలపైకి విరిచి కట్టడం మానేసింది. పిటపిటలాడే రైకలు తొడగడం అలవాటు చేసుకుంది. క్రమంగా మరో విషయం ఆమెకు తెలిసొచ్చింది. పిప్పరమెంట్లకీ, చాకలెట్లకీ మంచి పసందైన కాగితాలు చుట్టితే వాటిధర పెరుగుతుంది. అల్లాగే తన అవయవాలని మంచి మిలమల మెరిసే నైలాన్లలో పొదిగినట్లయితే వాటికే మంచివెల దొరుకుతుంది.

మరో ముఖ్యమైన విషయం ఆమె చౌదరితో పరిచయం ఏర్పడ్డాక గ్రహించింది. బెంగాల్ క్షామ నివారణకు సహాయార్థం చౌదరి ఒక నాటకం ఆడించాడు. అందులో నాయికా పాత్ర ధరించడానికి రాజమండ్రినుంచి రాఘవ కుమారి అనే అమ్మాయి వచ్చింది. రిహార్సల్సు చౌదరి ఇంట్లోనే జరిగేవి. రిహార్సల్సు అయిపోయినా, రాఘవకుమారి ఉండడానికి వేరే హోటల్ గది ఒకటి ఏర్పాటైనా, ఇంచుమించు అన్ని రాత్రులూ ఆవిడ చౌదరి ఇంట్లోనే గడిపింది. ఆవిడ చౌదరిని "బావగారూ" అని అతిముద్దుగా మూతి సన్నగాపెట్టి పిలిచేది. నాటకం అయిపోయాక, రాఘవకుమారి పర్సు బరువెక్కి ఆమె రాజమండ్రి వెళ్ళిపోయాక, తలుపులు చాలా ఆలోచించింది. తనెప్పుడూ చౌదరిని "ఏటిబాబు" అంటుంది. "బావగారూ" పిలుపులో నాజూకుంది. అంచేతే అన్నీ వాడిపోయిన రాఘవకుమారికి తనకన్న విలువ ఎక్కువ. అంచేత ఒకరోజు సాయంత్రం హోటల్నుంచి కారియర్ తెచ్చి విస్తట్లో వడ్డించి, స్నేహితులతో పేకాడుతున్న చౌదరి నుద్దేశించి "అన్నం వొడ్డించేసినాను. యెల్లిపోయొచ్చీయిండి- బావగోరు." అంది. చౌదరి పేకాటమరచిపోయి, కళ్ళప్పగించి ఆమె వంక చూశాడు.

ఆ తరవాత కొద్దిరోజులు ఆమె తూర్పుయాస పోగొట్టడానికి కొన్ని రాత్రులు తంటాలు పడ్డాడు చౌదరి. ఆ తరవాత "నటీమణి సవాలు" అన్న నాటకంలో నాయికాపాత్ర ధరించింది. అందులో చదువుకున్న స్త్రీ నాటకరంగంలో ప్రవేశించి, దాన్ని ఉద్ధరించడానికి ప్రయత్నించి తను పతనమై పోతుంది. ఆ పాత్ర తాలూకు భాష అంత వంటపట్టకపోయినా, కేవలం తన శరీర సౌష్టవం వల్ల నెగ్గుకొచ్చేసింది తలుపులు. ఆ తరవాత ఇంక తెరమీదకెక్కడం ఒక్కటే ఆమెకు మిగిలిన ఆశయం. అందుకనే చౌదరితో కూడా మద్రాసులో దిగింది.

మద్రాసులో దిగిన తరవాత సన్నాసి కేవలం ఆమె "మామ" మాత్రమే చౌదరి బావగారు.

చౌదరి దిగాడో లేడో సుందరం అతన్ని పట్టాడు.

సుందరానికి వేటకుక్క లక్షణాలు ఎన్నో ఉన్నాయి. ఆంధ్ర దేశంనించి సినీమా తీసే అభిప్రాయంతో మద్రాసు ఎవరు వచ్చినా, అతడు వాళ్ళు రాకముందే పసిగట్టేస్తాడు.

మద్రాసు నగరంలో ఉన్న కార్లలో మూడో వంతు మీద సుందరానికి హక్కులున్నాయి. వినాయక చెట్టియార్ ఊరెళ్ళాడనుకోండి.

సైకిలుమీద వాళ్ళ ఇంటికి వెడతాడు. వాళ్ళబ్బాయి చిన్నప్పచెట్టితో టిఫిన్ ఆరగిస్తాడు. ఆరగిస్తూ మధ్యలో టైం చూసుకుని.

"అడాడో స్టేషన్‌కి పోణమే. ఒరు ఫ్రెండు వణా తంబి; కారు శాలి ఎంగె?" అంటాడు.

"తంబి" ఎదురు చెప్పేముందే, నౌకరుకి ఆజ్ఞ జారీచేసి కారు తాళాలు తెప్పించుకుని, ఊపిరి వదిలేలోగా కారుని జైంయిమని పోర్టికోలోంచి రోడ్ మీదికి లాగించేస్తాడు. వినాయక చెట్టియార్ కాకపోతే, దామోదర మొదలియార్ సుందరానికి కారులేని లోటుండదు.

చౌదరి సిగరెట్టు ముట్టించాడు. పోర్టరు సామాను దింపుతున్నాడు. తలుపలు స్టేషనంతా కలియజూస్తోంది. పక్క పెట్లోంచి వచ్చిన సన్నాసి "ఓలమ్మో ఇదేటిది ఇంత పెద్దగున్నాది టేసను?' ' అని తన ఆశ్చర్యాన్నంతా ఒక్కగుక్కలో ప్రకటించాడు.

అప్పుడొచ్చాడు సుందరం గాలివానలా.

"హలో, హలో, హలో ఏమండీ ఇప్పుడు దానా వస్తిరి?"

"ఔనండి" అన్నాడు చౌదరి. ఇతనితో ఎక్కడ ఎప్పుడు పరిచయమయిందోనని కిందామీదా పడుతూ.

"ఊర్నుండి నేరుగా వస్తిరా?"

"అంటే విశాఖపట్నంనించి, నెల్లూరులో దిగలే" అన్నాడు చౌదరి ఏ ఊళ్ళో పరిచయమో తెల్సుకోడానికి.

"అదుదా" అన్నాడు సుందరం ఎటూ తేల్చకండా. తలుపులువేపు చూసి చిరునవ్వు నవ్వి "అమ్మగార్ని కూడ తీసుకువస్తిరే" అన్నాడు.

"తలుపులని మంచి స్టేజీ ఆర్టిస్టు," అన్నారు చౌదరి.

సుందరం గ్రహించాడు ఇది సినిమా వ్యవహారమేనని. వెంటనే పోర్టర్లతో అతి ఉత్సాహంగా అన్నాడు:

"ఎన్నడా పాక్కిరింగె, సామాను నెల్లాం ఎడుత్తి దుమ్మ కార్ల వెయ్యింగ 3074 రండి మీ... హోటల్ బుక్‌చేస్తారా?"

"లేదు, ఏ వుడ్‌లాండ్సుకన్నా...."

"రండీమా, మనకి ఫ్రెండ్సుదా."

అసలీ ఆసామీ ఎవరో తెలీకుండానే సుందరం మొగమాటంలో పడిపోయాడు చౌదరి, వాళ్ళని వుడ్‌లాండ్స్ కాటేజ్‌లో దింపి చెట్టియార్ ఇంటికి వెళ్ళాడు సుందరం. చిన్నప్ప చెట్టియార్‌తో అన్నాడు:

"తంబీ? ఓరు మైనర్ వందిట్టా తెలుంగుకార అప్పిడియేపుడిచిట్టే"

ఆ తరువాత సుందరం చౌదరిచేత ముందుగా కారు కొనిపించాడు. ఆ తరువాత ఇల్లు కుదిర్చాడు. తదుపరి సినిమా కంపెనీ పెట్టించాడు.

అప్పుడు ప్రారంభించేడు చౌదరి కథ కోసం అన్వేషణ. ఈనాటివరకూ అది సాగుతూనే వుంది.

కథ ఇంకా నిర్ణయం కాలేదుగాని, ఈ నాలుగైదు సంవత్సరాల్లోనూ ఎన్నో పరిణామాలొచ్చాయి.

కథ నిర్ణయం కాకముందే- బస్సురూట్లు అమ్మిన లక్షా ఏభైవేలూ అయిపోయాయి.

మిగతా ఆస్తి అమ్మడానికి వీల్లేకుండా అతని మామగారు బిడ్డల తరుపున దావా వేసి,ఆ ఆస్తికి అతని భార్యని గార్డియన్‌గా పెట్టించాడు.

తలుపులమ్మ కుమారి మోచనీదేవయింది.

ఇప్పుడు చౌదరిని ఆమే పోషిస్తుంది. అంటే రోజూ కాఫీహోటల్ ఖర్చుక్రింద, సిగరెట్లకీ రెండు రూపాయలు రెడ్డియార్ చేత ఇప్పిస్తూంది. అంటే రెడ్డియారిచ్చే రెండువేల లోంచీ తనే ఇస్తుంది.

సన్నాసి, అప్పుడూ ఇప్పుడూ మామూలేగాని, అతనిప్పుడు రెడ్డియార్ కారుని సొంతంలా వాడుకుంటున్నాడు. టెరిలిన్ బుష్ షర్టులు, కౌబోయి పాంట్లు వేస్తున్నాడు. నాటుసారా మానేసి, గ్రేప్‌బ్రాంది తాగితాగి మనిషి నున్నిత పడ్డాడు. ఈ మార్పుల కన్నిటికీ మూల కారకుడైన రెడ్డియార్ ఎవరో, ఎందుకో ఏ సందర్భంలో ఎప్పుడు వచ్చాడో కొంచెం వివరంగా ముందు ముందు తెలుస్తుంది.

ప్రస్తుతం తలుపులమ్మ కుమారి మోచనీదేవిగా ఎల్లా మారిందో చెపుతాను.

సుందరం "చౌదరీ చిత్ర" కంపెనీకి త్యాగరాజనగర్‌లో ఒక పెద్ద ఇల్లు అద్దెకు సంపాదించాడు. అద్దె అయిదువందలైనా, మేడమీద చౌదరీ తలుపులమ్మల నివాసానికీ, కింద ఆఫీసుకీ అనుకూలంగా ఉంది. సుందరం తనని ప్రొడక్షన్ మేనేజరుగా రు.400 జీతంమీద తనే నియమించుకున్నాడు. హీరోకీ, హీరోయిన్‌కీ, డైరెక్టరుకీ సంగీత డైరెక్టరుకీ అడ్వాన్సు లిప్పించాడు. కవిని కుదర్చడంలో కొంచెం చిన్న అభిప్రాయభేదాలొచ్చాయి అతనికీ చౌదరికీ సుందరం విషశ్రీ అన్న కవి అన్నివిధాలా అనుకూలంగా ఉంటాడనీ, అతను రాసిన చిత్రం "విషనాగు" మొన్ననే శతదినోత్సవం జరుపుకుందనీ, ఎంతోనచ్చచెప్పాడు. అయితే చౌదరికి సినిమా విషయం అనుకున్నప్పటి నించీ బ్రహ్మశ్రీ చేత కథ రాయించాలని పట్టుదల.

బ్రహ్మశ్రీ "నటీమణి నవాబు" రాసిన మహనీయుడు. ప్రదర్శనంలో ఎన్ని లోపాలున్నా, కేవలం రచయిత ప్రతిభవల్ల ఆ నాటకం రక్తి కట్టిందని యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ మొదలు, ఆస్పత్రి ప్రాసీవరకూ ఏకగ్రీవంగా అన్నారు. అంచేత చౌదరి బ్రహ్మశ్రీకి రమ్మని ఉత్తరం రాస్తూ డబ్బుకూడా పంపాడు.

బ్రహ్మశ్రీ ఉత్తరమూ డబ్బూ అందుకున్నాడు. ఒక వారం తరువాత అతని వద్దనించి సమాధానం వచ్చింది. సారాంశం ఇది:


చౌదరీ!

నా బోటి అనామకుణ్ణి సినిమా అందలం ఎక్కిద్దామని అనుకోవడం స్నేహితుల యెడల నీకున్న పక్షపాతానికి గొప్ప నిదర్శనం. అయితే పిల్లాజెల్లతో ఉన్న నేను ఏదో కడుపులో చల్ల కదలకుండా కలక్టెరాఫీసులో గుమాస్తాపని చేసుకుంటూ పొట్టపోసుకుంటున్నాను. ఇది వొదిలేస్తే మళ్ళీ దీన్ని తిరిగి సంపాదించుకోలేను. నీకు బోలెడంత పిత్రార్జితం ఉందని నాకు తెలుసు. అయితే అదంతా కలిపినా సినిమా కంపెనీలో కాఫీ ఖర్చుకి చాలదని వినికిడి. అదీగాక, ఎందరో ప్రతిభావంతులు రంగస్థలం మీద తమ నటనాకౌశల్యాన్ని రుజువు చేసుకున్నవారు, దేశఖ్యాతి నార్జించిన రచయితలు, చిత్రకారులు ఎన్నో ఆశలు పెట్టుకుని మద్రాసు వచ్చారనీ, ఆఖరికి పాండీబజారు పేవ్‌మెంట్లని ఆశ్రయించుకుని అన్ని ఆశలూ వొదులుకుని జీవచ్ఛవాల్లా బ్రతుకుతున్నారనీ అంటారు. కాలం కర్మం కలిసిరాక నేనుకూడా ఆ మహనీయుల జాబితాలోకి ఎక్కడం నాకిష్టంలేదని నా మనవి.

పాండీబజారు పేవ్‌మెంట్ల నాశ్రయించుకుని కొందరు మాజీ ప్రొడ్యూసర్లు కూడా ఉన్నారని వినికిడి. అందులో నువ్వు చేరొద్దని నా హెచ్చరిక.

సినిమా రంగాన్ని నువ్వు సాధించలేవని నాకు గట్టినమ్మకం ఏర్పడ్డంవల్ల ఇంతగా రాయవలసి వచ్చింది. అందుకు ఒక తార్కాణం చాలు.

శ్రీమతి తలుపులమ్మ కథానాయికి అని రాశావు. నేను వొద్దంటే నువ్వెల్లాగా మానవు. తలుపులమ్మది అసాధారణమైన శరీర సౌష్టవమని నేనూ ఒప్పుకుంటాను. ఆ పొంకంచూసి జనం ముగ్ధులైపోతారని నీ ఆశ. మూడు కోట్ల ఆంధ్రులికీ, తలుపులమ్మని చూడడానికి నీకళ్లు అరువివ్వడం అసంభవం. కథానాయకి లక్షణాల్లో పొంకంకూడా ఒకటి. అయితే అదొక్కటే ఉంటే చాలదు. చాలమంది కథానాయికలకి అది లేదుకూడా. అయితే ఆలోపం కప్పిపుచ్చడానికి ఇతర సాధనాలున్నాయి- రబ్బరు, ప్లాస్టిక్కు సాధనాలు, ఫలానిది అని చెప్పలేను కాని, మరొకటేదో ముఖ్యలక్షణం ఆమెలోంచి పుట్టదు. అయితే నేనిదంతా తెలియనితనంలో చెపుతున్నాననీ, శ్రీమతి తలుపులులోని లోటుపాటులు నీకు తెలిసినంతగా ఇంకెవ్వరికీ తెలియనీ నువ్వనుకోడం ఖాయం. అంచేత ఆమె కథానాయికగా ఒక చిత్రం- ప్రారంభిస్తావు- పూర్తిచేసినా చెయ్యలేకపోయినా- అంచేత ఒకటి, రెండు సలహాలు. తలుపులు పేరు బొత్తిగా తూర్పుకంపు కొడుతుంది. అంచేత పేరు మార్పించు. అసలు పేరు తలుపులు అయి ఉంటుంది. అంచేత మోచనాదేవిగా మారిస్తే, గంభీరంగానూ, ఎవరికీ అంతగా అర్థం దొరకనిదిగానూ ఉంటుంది. మరొక హెచ్చరిక, శ్రీమతి సినిమా జీవితం ప్రారంభించి నెగ్గుకొచ్చినవాళ్ళు బహు తక్కువ. అంచేత కుమారి మోచనాదేవి అని పేరుపెట్టు. శ్రీమం



తుల స్నేహంచేసిన ఈమె కుమారి అంటే ఎవరు నమ్మతారన్న సంకోచం నీకక్కరలేదు. సూర్యుడితో అవధికి మించిన స్నేహం చేసి, కర్ణుడంతటి బిడ్డనిగన్న కుంతీదేవే "కుమారి" అప్పటికి, మరొక ముఖ్య సలహా.

కుమారి మోచనాదేవి-- అనబడే తలుపులమ్మలో ఇతర విధాల ప్రతిభలు ఎన్నో వున్నాయి. మనుషుల్ని క్షణంలో పసిగట్టగల శక్తివుంది. తన భాషలో అతి చమత్కారంగా మాట్లాడి ఎంతటి మగవాళ్ళనైనా రంజింపగల వాకచక్యం ఉంది. అంచేత ఆవిణ్ణే ఆ తూర్పు భాషతో, ఆ పొంకంతో, రబ్బరు బొమ్మలా ఎగిరెగిరిపడే ఆ ఉత్సాహంతో తెరమీద కెక్కించగలిగావా; ఆమెకింక పట్టపగ్గాలుండవు. హాస్యవేషం వేయించావా, ఎంతటి హీరోయిన్నయినా తినేస్తోంది కుమారి మోచనాదేవి. ఇందులో నిజం నీకర్థం కాకపోయినా, ఆవిడ కర్థం అవుతుంది. చదివి వినిపించు ఆవిడ చదవలేదు గనక.

ఇట్లు
నీ శ్రేయోభిలాషి,
బ్రహ్మశ్రీ

తా. క: నువ్వు దయతో పంపిన రైలు ఖర్చుల డబ్బు తిరిగి పంపడం లేదు. సినీమా లోకంలో ఎందరో నీ డబ్బు తినబోతారు అనవసరంగా, అన్యాయంగా, నేను స్నేహితుల్లో తినదగినవాణ్ణే. అయినా, ఈ వందరూపాయలూ నీకవసరమొచ్చే పరిస్థితివస్తే-- రాకూడదని నా ఆశ-- నిర్మొగమాటంగా ఉత్తరం రాయి, తల తాకట్టు పెట్టయినా పంపించేస్తాను.

బ్రహ్మశ్రీ

ఈ ఉత్తరం చదువుకున్నాక చౌదరిగారికి, కోపం, భయం, ఉక్రోషం ఎన్నో వచ్చాయి. అది నవ్వురూపంగా పైకొచ్చింది.

"వాడెప్పుడూ ఇంతే! తలతిక్క మనిషి." అని ఏదో బహు విచిత్రమ్మైన కొత్తవిషయం కనిపెట్టినట్టు మరింత విరగబడి నవ్వాడు.

అయితే తలుపులమ్మకి ఉత్తరంలో ఒక విషయం నచ్చింది. "ఈరోయిన్ యాసం" అంటే తలుపులమ్మకి తలాతోకా లేని వ్యవహారంలా వుంది. హోదా ఏదో వస్తుందన్న వెర్రి వ్యామోహం తప్ప. అందులో సరదాలేదామెకు. హాస్యపాత్రవేసి అందులో తూర్పు భాష మాట్టాడమంటే, చెరిగిపారేస్తుంది, చౌదరి ధగ్గర ఈ కబురెత్తకపోయినా. ఆమె మనస్సులో ఇది ఆడుతోంది.

ఆ తరవాత సంఘటనలు కొంత గజిబిజిగా జరిగాయి, సుబ్బులు- "యుగస్త్రీ సప్లయరు"- తరుచు రావడం. చౌదరీ, డైరెక్టరు, సుందరం వగైరా ఇవతల కథతో కుస్తీ పడుతుంటే మేడమీదికి పోయి, కుమారి మోచనీదేవితో కబుర్లు చెబుతూ కూచోడం జరుగుతుండేది. సన్నాసికూడా ఉండేవాడు.

క్రమంగా సన్నాసి ఒక్కడే మిగలడం మొదలు పెట్టాడు. కుమారి మోచనీ దేవికి "యుగస్త్రీ సప్లయరు" తో సమాన స్థాయిని కూర్చుని మాట్లాడ్డం, ప్రొద్యూసరు తాలూకు మనిషి-హోదాకి తగదనిపించింది. ఆ సందర్భంలో పాండిచ్చేరీ వ్యవహారాలు చర్చించడం జరిగింది. సుబ్బులూ, సన్నాసీ.

దాని ఫలితంగా సన్నాసి కారుతోలడం అలవాటు చేసుకొన్నాడు. రోజూ పొద్దున్న 7 గంటలవేళ డ్రైవరుతో ఐలండ్ గ్రౌండ్సుకి పోవడం. అక్కడ కారుతోలడం నేర్చుకోడం అతని దిన చర్య. ఈ విధంగా రెండు వెళ్లుగడిచాక- ఒక రోజు పొద్దున్న మామూలుగా ఐలండ్ గ్రౌండ్సుకని బయలుదేరిన కారు మధ్యాహ్నానికి కాదుగదా, రాత్రికైనా తిరిగిరాలేదు. మర్నాడు తెల్లవారినా కారుగాని, సన్నాసిగాని ఇంటికి తిరిగి రాలేదు.

దురదృష్టవశాత్తూ ఆ రోజుని సుందరం "విశ్వశ్రీ" ని కూర్చోబెట్టి కథ రాయించడానికి ముహూర్తం పెట్టాడు. కారు లేదుగనుక కవిగార్ని టాక్సీలో తీసుకొచ్చాడు సుందరం. కాఫీ ఫలహారాలు, తమలపాకులు, తంగభస్మం అనబడే పొగాకు అన్నీ తృప్తితీరా సేవించి విశ్వశ్రీ కథచెప్పడం ప్రారంభించాడు. అంటే కథకి ఉపోద్ఘాతం.

"పది లక్ష లౌతుందండి Ten Laks" అన్నాడు విశ్వశ్రీ నోట్లో ఊటని కింద పెదవితో పట్టి. లక్ష రూపాయలు చేతపట్టుకుంటే కలర్ పిక్చర్ తియ్యొచ్చన్న సుందరం వేపు చౌదరి కనుబొమ్మలు ముడివేసి చూశాడు. సుందరం ఆ చూపు గమనించనట్టుగానే.

"అంతదా ఆరు ఆందిరా. మైసూరు ఒరురుబా తమిళ్ ఒండ్రె, బొంబాయి, కలకత్తా, ఒరిస్సా ఎల్లాం శేత్తి అంబరు వచ్చింగ. శేలిది ఒరురుబా వాన్దా శెప్తినే" అన్నాడు.

చౌదరి సిగరెట్టు ముట్టించాడు. విశ్వశ్రీ ఉమ్మి వేసుకొచ్చాడు.

"అణ్ణా! కతదా సెప్పండిమీ" అన్నాడు సుందరం. విశ్వశ్రీ చెప్పడం మొదలుపెట్టాడు.

"ఎన్.టి.రామారావు వీథివెంట నడుస్తున్నాడు.... రామారావుగారే వెయ్యాల్లెండి ఈ వేషం. ( సుందరం తల ఊపాడు) రామారావు నడుస్తున్నాడు. దారి తరగడం లేదు. పైజమా దుమ్మైపోయింది. ఎడం కాలిజోడు తెగిపోయింది. అది రోడ్డు పక్కనిపారేసి మళ్ళీ నడుస్తున్నాడు. నూతిదగ్గర కొచ్చాడు. లోపలికి చూశాడు. నుయ్యి వాడకంలో లేదు, లోపల నాచు, కప్పలు. "ఛ", అనుకున్నాడు, బయలుదేరాడు, నది వేగంగా ప్రవహిస్తోంది. అందులోకి చూశాడు. బురదకట్టు ఈదుకుంటూ వచ్చింది గట్టుకి. గట్టంతా బురద, ఒండ్రుమట్టి. "ఛ!" అనుకున్నాడు మళ్ళీ. సముద్రం కెరటాలు ఉవ్వెత్తుగా వచ్చి గట్టుకి ఎగబాకుతున్నాయి- అతని కాళ్ళదాకా, కాళ్ళమీద ఇసక కరిగి కళ్ళు తిరిగినట్టయింది. తడబడ్డాడు. చతికిల బడ్డాడు. ఎందుకంటే, పగలంతా ఏమీ తినలేదుగామరి. అందుకని నీరసం. పెద్ద కెరటం వచ్చింది. నీళ్ళాయిసకా కాస్త నోట్లోకి పోయాయి. ఉప్పుకషం ! ! ఛ- అనుకుని ఉమ్మేశాడు మళ్ళీ. తడిగుడ్డలతోటే రైలుకట్ట దగ్గర కొచ్చాడు. బ్రిడ్జి దిగింది రైలు. జోరుగా వాలుకి జారిపోతోంది- అరువై మైళ్ళస్పీడు, డీసెల్ ఇంజన్ కూడా. రామారావు రైలుపట్టా మీద తలెట్టాడు. ఆత్మహత్య కోసమేగా బయలుదేరాడు మరి? రైలు ఒచ్చేస్తోంది- రామారావు తలతియ్యలా, రైలొచ్చేసింది. అయినా తల తియ్యలా, పది గజాలు, అయినా కదల్లా, గజం- ఊహూ- రామారావక్కడే ఉన్నాడు. ఇంక మెడమీంచి పోతుంది రైలు. కర్రుమంది బ్రేకు- రైలంతా ముందుకీ వెనక్కీ గుంజుకుంది. బిగ్రబిగసింది బ్రేకు, శక్తికొద్దీ పట్టాడుడైవరు మెల్లగా జారింది ఇంజన్ ముందుచక్రం, రామారావు. మెడదాకా వొచ్చింది, తగిలింది కూడా. ఆగిపోయింది.

ఎవరూ ఏమీ మాట్లాడలేదు. ఊపిరి బిగబట్టుకుని విన్నారు. చౌదరి గుండె రైలు ఇంజన్‌లాగే కొట్టుకుంది, విశ్వశ్రీ ఉమ్మి వేసుకోడానికి వెళ్లాడు. అప్పుడొచ్చాడు సుబ్బులు- మేడమించి.

"చౌదరిగారూ?... కొంప మునిగింది," అన్నాడు.

ఇదికూడా కథలో భాగంలాగే అనిపించి, చౌదరిగారు కదలలేదు.

"బావగోరూ! మావc" అంటూ మేడమెట్లమించి పడిపోయినంతపని చేసింది- కుమారి మోచనీదేవి. అప్పుడు చౌదరి లేచివెళ్ళి ఆమె మూర్ఛవొచ్చి పడిపోకండా పట్టుకున్నాడు. మేడమీదికి తీసుకపోయాడు.

మేడమీద, సుబ్బులు గజిబిజి మాటల మహారణ్యంలోంచి వెలువడ్డ కథ ఇది.

క్రితం ఉదయం ఇద్దరూ కారుతీసుకని-- పాండిచ్చేరి వెళ్ళారు. సన్నాసికీ సాయంకాలానికి కొంత నిషా ఎక్కువైన మాట నిజం. అతనిదగ్గర-- మరి ఎలా వచ్చాయో-- మూడు వేల రూపాయిలున్నాయి. మూడువందల యాభై గ్రేప్ సీసా లొచ్చాయి. ఆ డబ్బుకి-- మద్రాసులో అమ్మితే వెయ్యిరూపాయిలొస్తాయని సుబ్బులే యదాలాపంగా అన్నాడు. సన్నాసి అంతపనీ చేస్తాడనీ సుబ్బులు-- "సత్తెప్రమాణకంగా" అనుకోలేదు. అర్ధరాత్రి కారు తోలుకొస్తుంటే-- పోలీసులు కారునీ, సన్నాసినీ గ్రేప్ బుడ్లనీ పట్టుకున్నారు. సుబ్బులు ముందు జాగ్రత్తగా కార్లోంచి దూకేసి కబురు చెప్పడానికి పరుగెత్తు కొచ్చాడు.

జేబులో కానీలేదు. ముప్పై మైళ్లు నడిచాక ఒక లారీవాడు దయదలిచి ఎక్కించుకున్నాడు. అమింజికరై రైల్లో వొదిలేశాడు. టాక్సీ



ఒకటిపట్టి ఆఫీసు చేరుకున్నాడు.

టాక్సీ ఇంకా అవతలే ఉంది డబ్బుకోసం.

ముందు ఆఫీసులో కథ అవుతోందని, వెనక మెట్లమీదుగా వెళ్లి "ఓ శనియమ్మ"కి చెప్పాడు. ఇంక నీరసం వొచ్చి పడిపోయాడు. మోచనీదేవి రాగవరసి మొదలెట్టింది.

"నామామ నేటి నేత్తాడు దేవుడో--దేవుడా" అంటూ- చౌదరి చిరాకుగా, కోపంగా, కంగారుగా, "అబ్బ! ఊరుకో- కింద అందరూ ఏంటే బాగుండదు." అన్నాడు. మోచనీదేవి శ్రుతి పెంచింది- "నామామ కేటయిపోనాది నాయనో..."

అప్పుడు సుందరం అడ్డుపడ్డాడు.

"అదాదే తంగచ్చీ, నాన్‌దా ఉంటినే," అన్నాడు సుందరం. టెలిఫోన్ తీసి, అంకెలు తిప్పి- "హల్లో... ఆ రెడ్డియార్ ఉండారా!.... రెడ్డియార్ సార్- నాన్‌దా- సుందరం... వరే సార్ ఒక సగాయం కావాల." ఫోన్ పెట్టేసి చౌదరీ మోచనీల నుద్దేశించి. "మన తెలుంగు వాండుదా పాండిచ్చేరీ సొంత ఊరు. పెద్ద బిసినస్, మనం ఎంతసెప్తే అంతదా, రొంబ ఇన్‌ఫ్లుయన్స్, పోలీస్, గీలీస్, మాజిస్ట్రేట్- అంతా ఆయన సేతులో ఉండారు. రండిమీ చౌదరిగారు. కత పినిష్‌సేసి, రెడ్డియార్‌సి పోయిసూస్తుదు."

మోచనీదేవిని ఓదార్చడానికి సుబ్బులు మేడమీదుండి పోయాడు. చౌదరీగారు, సుందరం కిందకి వెళ్లారు. విష్ణశ్రీ కథ వినడానికి. ఎందు కంటే మోచనీదేవికి ఏడుపొచ్చినా, కోపం వచ్చినా, ఆఖరికి అవధికి మించిన ఆనందం వొచ్చినా, చౌదరికి కోపం తప్ప మరొకరకమైన ఉద్రేకం రాదు. అందువల్ల ఆయన పక్కనుండి తన్ని ఓదార్చాలని ఆమె ఎప్పుడూ అనుకోదు; ఆశించదు.

విష్ణశ్రీ మూడోమారు తాంబూలంలో పొగాకు దిగించి కింద పచారు చేస్తున్నాడు. కథలో మరో కథ అడ్డుతగిలితే అతనికి చిరాకు. అంతేకాదు. అయిదు నిముషాల క్రితం చెప్పిన కథ మరచిపోయి యీ కొత్త కథలోకి అకస్మాత్తుగా అడుగు పెడతాడు. అందుకని అతనికి ప్రతి నాలుగు నిమిషాలకీ జరిగిన కథ గుర్తుచేస్తుండాలి. ఆ అవకాశం లేక తిరిగి కథ మొదలుపెట్టినప్పుడన్నాడు.

"సరే- ఎన్.టి.ఆర్. విమానం మీంచి దూకేశాడా...."

"ఏడిసినట్టుంది. విమానం ఎక్కణ్ణించొ చ్చింది?" అన్నాడు చౌదరి అసలే చిరాకుగా ఉండి. విష్ణశ్రీ మహా ఉద్రేకం మనిషి. అతని నోట్లో తాంబూలం పొగాకు కలిసిన ద్రావకం చౌదరి ముఖానికి రంగు వెయ్యకుండా సుందరం అడ్డుపడ్డాడు.

"అణ్ణా! కత అంతవరై రాలేదే-" అని విష్ణశ్రీ చెప్పిన కథని అతనికి తిరిగి జ్ఞాపకం చేశాడు. విష్ణశ్రీ అందుకున్నాడు.

ఇంజన్ చక్రం ఎన్.టి.ఆర్. మెడ దాకా వచ్చేసింది. అయినా అతడు లేవలా. ఇంజన్ డ్రైవర్ దిగొచ్చాడు. ఎన్.టి.ఆర్. ని చూశాడు. "రామూ" అని అరిచాడు. అతన్ని గట్టిగా కౌగలించుకున్నాడు. ఇంజన్ డ్రైవర్ ఎవరో తెలుసా? రంగారావు వెయ్యాలనుకోండి ఆ వేషం. అతను ఎన్.టి.ఆర్ ఫాదరన్నమాట.

"అణ్ణా! కొణ్ణుట్టే" అని అరిచాడు సుందరం. అది మెచ్చుకోలే ఎత్తిపొడుపో అర్థం కాకుండా.

"ఏడిసినట్టుంది. నాకేం నచ్చలా" అన్నాడు చౌదరి.

"నచ్చలేదూ?" అన్నాడు విష్ణశ్రీ నోట్లో ఎర్రటి ద్రావకాన్ని కూడ గట్టుకుంటూ.

చౌదరిసార్, ఆ తరవాతదా మంచి క్లయిమాక్సుండాది, అని సర్దడానికి ప్రయత్నించాడు సుందరం.

ఆ క్లయిమాక్సులో ప్రవేశించాడు చౌదరి మామగారు పట్టయ్య చౌదరి. గుడ్లురుముతూ చౌదరినీ, సుందరాన్నీ, విష్ణశ్రీని పరీక్షగా చూశాడు. ఒక్క విష్ణశ్రీయే, నీ చూపులికీ నీ బుర్రమీసాలకీ నే బెదురుతానా అన్నట్టు తాంబూలం నిర్లక్ష్యంగా నములుతూ నిలబడ్డాడు. ఇంతలో రిక్షావాడు ఒక బెడ్డింగు తెచ్చి లోపలపెట్టి కూలికోసం నిలబడ్డాడు. ఆ తరువాత పట్టయ్యచౌదరికీ, రిక్షావాడికీ రామరావణ యుద్ధం- నేటి ఉపమానం చెప్పాలంటే భారత పాకిస్తాన్ యుద్ధం. వేరువేరు భాషల్లో నడుస్తుంటే, సుందరం కలుగజేసుకుని, రిక్షావాణ్ణీ, విష్ణశ్రీని అవతలకి తీసుకపోయి, హాల్లో- సీజ్ తిరుగుబాటుకి జాగావేశాడు.

"ఏందిరా. బస్సురూట్ల సామ్ము కరా రావుదేనా, ఏమున్నా మిగిలి సచ్చిందా" అని పరామర్శించాడు పట్టయ్యచౌదరి. రామకృష్ణ చౌదరి దానికి సమాధానం చెప్పలేదు.

"ఎవరో తలుపులో కిటికీలో యీరోయి న్నంటగా?" అన్నాడు మావC చౌదరి.

"ఆపిణ్ణల్లా అవమానించావంటే మాట దగ్గదు" అన్నాడు అల్లుడు చౌదరి.

"నోరుముయ్యరా సవటా. నాలుగు డబ్బులు చేతికొచ్చినపాటి బూపీC ఆకాసం కనపడదు కుర్రపీనుగులకి... వొయస్సులో మేవCతా ఏదో ఏడిసివోళ్ళవేC. అయితే చినీమాల్లోకి దిగి అసలుకి మోసంవొచ్చి పనిజెయ్యలే...."

అల్లుడు చౌదరి ముఖం చిట్లించి, మూతి దిగించి తన అసమ్మతిని తెలియజేశాడు. మావC చౌదరి చుట్ట అంటించి తను వచ్చినపని వివరించాడు.

"అయిందేదో అయిపోయింది. ఇంక ఈ మకాం ఎత్తేసి, ఇంటికొచ్చెయ్యి. మద్దానం రైలుంది."

"రాను" అన్నాడు అల్లుడు చౌదరి.

"నెల్లూరులోనే ఏనాడోళ్ళ శానామం దున్నారు. మంచి పిటపిటలాడే వోళ్ళు. కావాలంటే నెలకోవందపారేసి, పరిమనెంటుగానే పెట్టుకో.. నే వద్దన్లే. ఇంటు పట్టుపి పడుండు- అంతే-"

"రాను." అన్నాడు అల్లుడు చౌదరి.

ఆ తరవాత అదమరుపుగా కుమారి మోచని మెట్లుదిగడం, వెనక సన్యాసి ఆమె నోదారుస్తూ అనుసరించడం- మామ చౌదరీ, ఆమెను చూసి "బానే వుందే," అని చుట్ట పొగ మధ్యనించి మెచ్చుకోడం, అల్లుడు చౌదరి "పైకి పో" అని అరవడం, కుమారి సన్యాసి చేతులో మూర్ఛపోడం- తరువాత మామ అల్లుళ్ళ మధ్య తగాదా శ్రుతిమించడం- అల్లుడు మామగార్ని అవతలికి గెంటి తలుపెయ్యడం, వగైరా జరిగాయి. మధ్యాహ్నం రెడ్డియార్ కార్లో, సన్యాసిని విడిపించడానికి, రెడ్డియార్, సుందరం, కుమారి మోచనీ, సుబ్బులు ఎక్కారు. ఇంక చోటులేక చౌదరి ఆగిపోవలసి వచ్చింది. చౌదరి తనకసినంతా సిగరెట్లమీద చూపించాడు. అంత ఇంటికీ అతనొక్కడు మిగిలాడు.

బాలుడు: టైం. ఎంతైందండీ, బాబూ రావుగారూ!

బా: (బాలుడివీపు మీద ఒక్కటికొట్టి) ఇంతైంది.

బా: నయమే యింకా. గంటకిందట అడిగాను కాను.

--భమిడిపాటి కామేశ్వరరావు

* * *

బొమ్మలు రాసే సత్యమూర్తితో.

బంగారమ్మ: నా బొమ్మ వేసిపెట్టాలండి. సరిగ్గా నాకుమల్లేనే ఉండాలి. బాగుండాలి.

స: కుదరదండి. ఏదో ఒకటి మీరే చెప్పండి బాగా ఆలోచించుకొని.

--భమిడిపాటి కామేశ్వరరావు

రాజమండ్రి రైలు స్టేషనులో మెయిలు పైముకి-

శంకరం: ఎక్కడికిరోయ్ భాస్కరం?

భా: ఏలూరు.

శం: మరి, చేతులో దమ్మిడీ ఆడటం లేదన్నావు నిన్న నా బాకీ ఇవ్వమంటే?

హా: అందుకనే, కానీ ఖర్చులేని టికెట్టు కొంటా.

--భమిడిపాటి కామేశ్వరరావు

* * *

బిచ్చగాడు: చూడకళ్ళులేవు, నారాయన్నారాయన!

సుబ్బులక్ష్మి: ఎప్పణ్ణించి నాయనా నీకీ అవస్థా?

బి: వారం రోజుల్నించి, తల్లి





నాలుగు రోజుల తరవాత రెడ్డియార్ కార్లో సన్నాసితో సహా పిగతా అందరూ దిగారు. పాండిచ్చేరీ నించి. కారుదిగుతుండగా కుమారి మోచనీదేవి, రెడ్డియార్ సంచుల్లో వారిన బుగ్గల్ని ఆప్యాయంగా పీటడం చౌదరి కళ్ళారా చూశాడు.

ఆ తరవాత అతివేగంగా వచ్చేశాయి పరిణామాలు. పట్టయ్య చౌదరి అల్లుడిమీద దావావేసి, ఆస్తికంతకీ, పిల్లల తరఫున తన కూతుర్ని గార్డియన్ పెట్టించాడు.

ఈ దావాకీ, సన్నాసి మీద కేసు రద్దు చేయించడానికీ చౌదరి దగ్గరున్న తక్కిన సొమ్ము కర్చైపోయింది.

చౌదరి కారులో కొన్ని ముఖ్యమైన సామానులు, కారు మాజిస్ట్రేటు కోర్టులో ఉండగా, పోలీసులు తీసేసుకున్నారని వదంతి. మిగిలిన కారు ఒక ధర ఇచ్చి రెడ్డియార్ కొనేశాడు. వొచ్చిన డబ్బులో సుందరం, తన కమీషను పోగా, మిగతాది తన జీతంకింద జమ కట్టుకున్నాడు.

ఇహ--

రెడ్డియార్ ప్రతి రాత్రి 7 గంటలనుంచి, 9 గంటలవరకూ "ఆఫీసు" లోనే మకాం. ఆ తరవాత "ఆఫీసు" నీ మిగతా హంగుల్నీ తను ఎవరెల్లా వాడుకున్నా ఆయనకేమీ అభ్యంతరం లేదు. నెలకీ రెండువేలు కుమారి మోచనీకిస్తాడు. అది ఎల్లా ఖర్చుపెట్టుకున్నా అతనికి అభ్యంతరం లేదు.

క్రమక్రమంగా ఆఫీసుకి- రెడ్డియార్ లేనప్పుడు- యజమాని ఎవరన్న విషయమై సన్నాసికీ, చౌదరికీ, ప్రచ్ఛన్న యుద్ధం ప్రారంభమైంది. అది తీవ్రరూపం దాల్చకుండానే సన్నాసి తన ఆధిక్యం నిరూపించుకున్నాడు.

"పోనీ మీ వూరెల్లి పోయొచ్చేయండి బావగోరు" అంది కుమారి మోచనీ, ఎంతో జాలిపడుతూ.

"నా పెళ్ళాంమీద అప్పీలుజేసి, ఆస్తి వశపరచుకుని, పిక్చర్‌తీసి పారెయ్యాలి. అప్పుడింటి కెళ్ళాలి' ' అన్నాడు చౌదరి.

ఈ లోగా రోజుకి రెండు రూపాయలు ఆయన ఖర్చుకింద సర్దుతోంది కుమారి మోచనీ.

రెడ్డియార్ మద్దతుతో పట్టుబడకుండా, పాండిచ్చేరీ నించి గ్రేప్ బుడ్ల దిగుమతి నిరాఘాటంగా సాగిస్తూ పెద్దవాడై పోయాడు సన్నాసి.

ఏ మాట కా మాటే చెప్పుకోవాలి. కుమారి మోచనీకి, చౌదరంటే ఎంతో ఇది- అవి జాలనండి. అభిమాన మనండి. కృతజ్ఞత అనండి. ప్రేమనికూడా అనండి.

చౌదరి కథకోసం వెతుకుతూ పాండీబజార్లో తిరుగుతున్నాడు- సినీమా కథకోసం.

బ్రహ్మశ్రీ తడుపరి రాసిన జాబులో- "మిత్రమా, కథకోసం అంతగా వెతకడం ఎందుకు? నీ కథ అద్భుతంగా ఉంటుంది- సినీమాకి. నా మాట విని అది నిర్ణయం చెయ్యి." అని రాశాడు. అయినా బ్రహ్మశ్రీ మీద చౌదరీకి కోపం రాలేదు- ఉక్రోషమో, ఆవేదనో, కంగారో తెలీకుండా అది చదువుకుని పకపక నవ్వుకున్నాడు.

యథాప్రకారం సుబ్బులుతో కలిసి పెసరట్లు తింటూ కథకోసం అన్వేషిస్తూ కాలం గడుపుతున్నాడు చౌదరి. కథ దొరకగానే, తనే పెళ్ళాం దగ్గరకెళ్ళి ఓ రాత్రి ఖుషామత్‌చేసి, కావలసిన సొమ్ము తేవచ్చుననీ. దాంతో పిక్చర్ తీసి తన జన్మ సఫలం చేసుకోవచ్చుననీ, ఆఖరికి అంతా సుఖాంతం అవుతుందనీ అతని ఆశ. అయితే కథ దొరకాలి ముందు- మంచి కథ.

# మొదటి మాటలు

బుచ్చిబాబు



పువ్వు పుట్టగానే పరిమళించవచ్చు గాని, గొప్పవాళ్ళు పుట్టగానే వారి గొప్పదనం గుబాళిస్తుందా?

గొప్పవాళ్లు పుట్టగానే మాట్లాడగలిగితే ఏం మాట్లాడివుంటారో, అలాగే వాళ్లు చనిపోయేక్షణంలో ఏం మాట్లాడి వుంటారో ఊహించి వ్రాయడం ఒక సారస్వతక్రీడ. ఈ క్రీడలో విశేషమేమిటంటే, ఒక్క వాక్యంలో ఆ ప్రముఖుల జీవితంలోని విశేషమంతా వ్యక్తం కావాలి.

తెలుగు రచయితలలో ప్రసిద్ధులైన కొందరి మొదటి మాటలను ఊహించి వ్రాసిన వాటిని ఈ చిన్నవ్యాసంలో పొందుపరుస్తున్నాను. ఈ విధంగానే ప్రముఖుల చివరి మాటలుకూడా ఊహించి వ్రాయొచ్చు.

ఉదాహరణకి:

కందుకూరి వీరేశలింగం: "ఒక్క వెధవని వుండనివ్వను-- స్వర్గంలో."

గిడుగురామమూర్తి: "నేను మరణించు చుంటినని ఏప్రజయున్‌దలంప నవసరంబులేదు-అని అనను. నేచస్తున్నా. దగ్గరగారా, చెవులో చెప్ప- పైన అరసున్నలుంటాయా?"

గురజాడ: డామిట్, కథ అడ్డంగాతిరిగింది.

వేమన: మనరవేమా.

ఉన్నవ లక్ష్మీనారాయణ: అక్కడ 'బ్రాహ్మణ అగ్రహారం' వ్రాయాలి.

కాళిదాసు: మేఘాలమీదనే మనం వెళ్ళడం?

రామిరెడ్డి: 'చిమ్మ చీకటి నొంటి చిక్కుకొనియుంటి!'

నండూరి సుబ్బారావు: ఆరిపేయవె దీపము.

బాపిరాజు: పోవోయిసిన్నవాడా.

సజీవులైన వ్యక్తుల చివరిమాటలు మన సంప్రదాయం హర్షించదుగావున ఈ శీర్షికలో మొదటిమాటలు మాత్రం వుంచాను.

ఇక కొందరి మొదటిమాటలు. రాయప్రోలు సుబ్బారావు; "అ-ఆ-ఇ ఈ-ఉ-ఊ" (పుట్టగానే ఆయన ఏడుపు.)

దీనికాధారం:

"ఏ ప్రపుల్ల పుష్పంబుల నీశ్వరునకు - పూజసల్పితినో ఇందు పుట్టినాడ - కలదయేని పునర్జన్మ కలుగుగాక- మధుర మధురంబయిన తెన్గు మాతృభాష"

విశ్వనాథ సత్యనారాయణ: (మంత్రసానిని సంబోధిస్తూ.)

"ఓహో కిన్నెరసాని!"

(జననం శీతాకాలంలో అయితే)

"హూ హూ హూ హూ"

మునిమాణిక్యం: "మనం ఇంకా ఇరవయేళ్ళదాకా చీర కొనక్కర్లేదు - కాంతానికి."

చలం: (మంత్రసానితో) పో, లేచి పో, డ్యాక్టర్‌తో.

మొక్కపాటి: "బార్ - బార్ - బార్" (అని ఏడుపు) మూలం. బారిస్టర్ పార్వతీశం.

నండూరి సుబ్బారావు: "ఎనక జల్మములో ఎవరమో"

ఉన్నవ లక్ష్మీనారాయణ: (చుట్టూ చూసి, "ఏమిటీ మాలపల్లి?")

భమిడిపాటి కామేశ్వరరావు: "ఎప్పుడూ ఇంతే"

కృష్ణశాస్త్రి: "వెక్కి వెక్కి రోదింతును విసువులేక- ఏడ్వలేక ఏడ్వలేక ఏడ్చుచుంటి."